





కొండకు ప్రభను తీసుకొస్తున్న మహిళలు, చిన్నారులు





కొండంత సంబరం

- ఘనంగా శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ళ ఉత్సవాలు ప్రారంభం
- స్వామికి విశేష అభిషేకాలు
- కొండకు తరలివచ్చిన చిట్టి పొట్టి ప్రభలు
- గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 6: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఏకాదశి పండుగను పురస్కరించుకొని భక్తుల రద్దీ నెల కొంది. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ళ మహోత్సవాలు బుధవారం ఘ నంగా ప్రారం భమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలి వచ్చారు. నరసరావుపేట నుంచి చిన్నారులు, మహిళలు కాలినడకన కోట య్య సన్నిధికి చేరుకున్నారు. భక్తులు గిరి ప్రదక్షణ చేశారు. కొండ దిగువున సోపాన మార్గం వద్ద ఉన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వేలాది మంది భక్తులు మెట్ల పూజ చేశారు. సోపాన మార్గంలో ఉన్న ఆనందవల్లి ఆలయంలో కూడా పూజలు చేశారు. ధ్యాన శివుడు, నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ నెలకొంది. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్ప కొండకు చేరుకుంది. స్వామి దర్శనం అనంతరం భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. కొండ దిగువున తల నీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్య వేక్షించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ షిరిడీ సాయి అన్నపూర్ణ అన్నదాన కమిటీ, ఆర్యవైశ్య సంఘం సేవా సంస్థల ఆధ్వర్యంలో అల్పాహారం, పులిహోర, మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. శాసనసభ్యుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి.. స్వామివారిని దర్శించు కొని ప్రత్యేక పూజల్లో పాల్గొ న్నారు. గిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.





శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు




విద్యుత్ వెలుగుల్లో అమరావతి అమరేశ్వరస్వామి ఆలయ గోపురం

రేపే ప్రభల పండుగ

- పోటాపోటీగా విద్యుత్ ప్రభల నిర్మాణం
- ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులకు పైగా..
- తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం

తిరునాళ్ళకు నెల రోజుల ముందు నుంచే గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల సందడి మొదలవుతుంది. ఊరంతా కలసికట్టుగా ప్రభ పనుల్లో పాల్గొంటారు. తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తున్నాయి. ఒక్కో ప్రభ నిర్మాణ వ్యయం రూ.25లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఉంటుంది. ప్రభల నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గతంలో ఎడ్లతో ప్రభను తరలించేవారు. నేడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాతితో తయారు చేసిన చక్రాల రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెను వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పనివారు వెంట నడుస్తారు. ప్రభకు ఏర్పాటు చేసే లైట్లు, తోరణాలు అమరికలో కూడా ప్రత్యేకత సంతరించుకుంటుంది. రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. ఈ ప్రభలలో పోస కూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు ఇలా వివిధ రకాలుగా ఉంటాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలి వస్తాయి. ప్రభలపై తిరునాళ్ళలో సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. మహాశివరాత్రికి భక్తులు కొండలో జాగరణ చేస్తారు. తిరునాళ్ళ వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించి పులకించి పోతారు. నరసరావుపేట మండలంలోని గురవాయపాలెం, ఉప్పలపాడు, కాకాని నుంచి రెండు, ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి కాకాని ఒక్కో భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం గ్రామం నుంచి 6 ప్రభలు, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలిరానున్నాయి.



గురవాయపాలెం గ్రామంలో తిరునాళ్ళకు నిర్మించిన విద్యుత్ ప్రభ

8 నుంచి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యాటీ వద్ద ఉన్న హెటీ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివే యండం జరుగుతందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తిరునాళ్ల రోజున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే తిరునాళ్ల మరుసటి రోజు శనివారం ప్రభలు తిరిగి గ్రామాలకు తరలించేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. గతంలో రెండుగంటల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఒకే సారి ప్రభలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో సమయంను పెంచడం జరిగిందన్నారు.



కొండ దిగువున ఏర్పాటు చేసిన ఎమ్యూజ్‌మెంట్ పార్క్

ఘాట్ రోడ్డులో నడకకు అనుమతి లేదు

భక్తులు సోపాన మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కూడా నడకతో కొండపైకి చేరుకుంటున్నారు. దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈసారి తిరునాళ్ల రోజున ఘాట్ రోడ్డులో భక్తుల నడకను అనుమతి లేదని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రకటించారు. భక్తులు సోపాన మార్గం గుండా కొండపైకి రావాలని కోరారు.



చిన్నారుల మెట్ల పూజ

తిరునాళ్లకు 528 బస్సులు

తిరునాళ్లకు ఆర్టీసీ 528 బస్సుల ను ఏర్పాటు చేస్తున్నట్లు నరసరా వుపేట డీఎం బత్తుల వీరాస్వామి బుధవారం తెలిపారు. నరసరావు పేట నుంచి 265, చిలకలూరి పేట నుంచి 100, అద్దంకి 30, ఒంగోలు 45, చీరాల 45, విను కొండ 43 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఘాట్ రోడ్డులో కొండ దిగువ నుంచి ఎగువకు భక్తుల కోసం తిరుమల నుంచి వచ్చిన శేషాద్రి బస్సులు నిర్వహిస్తామన్నారు. వీఐసీల కోసం 20 సూపర లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నరసరావు పేట నుంచి కొండ దిగువకు టిక్కెట్ రూ.30, కొండ దిగువ నుంచి కొండ పైకి టిక్కెట్ రూ.25, చిలకలూ రిపేట నుంచి రూ.30, వినుకొండ రూ.60, ఒంగోలు రూ. 120,చీరాల రూ.100, అద్దంకి టిక్కె ట్ ధర రూ.105 అని తెలిపారు.

నేటి నుంచి గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు), మార్చి 6: గుంటూరు సమీపంలోని హోసన్నా మినిస్ట్రీస్ గోరంట్ల ఆధ్వర్యంలో 47వ అంత ర్జాతీయ గుడారాల పండుగ గురువారం సాయంత్రం ఆరు గంటల నుం చి ప్రారంభం కానుంది. నాలుగు రోజులు జరిగే పండుగకు లక్షల మంది విశ్వాసులు హాజరవుతారు. పగలు, రాత్రి సమయాల్లో జరిగే ప్రార్థనలకు వేర్వేరు వేదికలను సిద్ధం చేశారు. ప్రార్థనలను తిలకించేందుకు ఆవరణలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రే వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి పలువురు చేరుకున్నారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ, పాస్టర్లు రాజు, ఫైడిపాల్, రమేష్‌తో పాటు దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన జాషువ మోజేస్ ప్రారంభప్రార్థనలు, గీతాలు ఆలపించారు.



ప్రార్థనలు చేస్తున్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం తదితరులు

పండుగకు ప్రత్యేక రైళ్లు

పండుగకి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. నెంబరు.07225 అనకాపల్లి - గుంటూరు రైలు బుధవారం రాత్రి 7.40కి బయలుదేరి గురువారం ఉదయం 7 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. నెంబ రు. 07226 గుంటూరు-అనకాపల్లి రైలు ఈ నెల 10న రాత్రి 10.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10కి అనకాపల్లి చేరుకుంటుంది.

అంబటి రాంబాబుకూ.. స్థానభ్రంశం

- చిలకలూరిపేటకు మంత్రి బదిలీ
- మోదుగుల సత్తెనపల్లికి
- వైసీపీలో తీవ్రస్థాయిలో చర్చ
- త్వరలో విడుదలయ్యే జాబితాలో వీరి పేర్లు ఉండొచ్చు..?

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల అభ్యర్థుల జాబితా అంతా సిద్ధమైపోయిం దని ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి వారం క్రితం ప్రకటించారు. అయినా ఇంకా మార్పులు జరుగుతూనే ఉన్నాయి. కీలక నేతల స్థానాలనూ మారుస్తున్నారు. మంత్రి అంబటి రాంబాబుకూ స్థాన భ్రంశం జరిగినట్లుగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సత్తెనపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి అంబటి రాంబాబును చిలకలూరిపేటకు బదిలీ చేసినట్లుగా పార్టీవర్గాలు చెబుతున్నాయి. సత్తెనపల్లి సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డిని నియమించినట్లు చెబుతున్నారు. సిట్టింగ్ స్థానంలో మంత్రి రజిని కొన సాగితే ప్రతికూల ఫలితాలు వస్తాయని సర్వే ఫలి తాలు రావడంతో.. ఆమెను చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమకు గతంలో మార్చేశారు. ఆ తర్వాత స్థానికుడైన మల్లెల రాజేష్‌నాయుడు సమన్వయ కర్త గా వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే తాజాగా ఈ స్థానంపై పలు సర్వేలు చేశాక మంత్రి అంబటి రాంబాబు ను బరిలోకి దింపాలన్న యోచనకు జగన్ వచ్చారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. మోదుగుల వేణుగోపాలరెడ్డిని సత్తెనపల్లె నుంచి బరిలోకి దింపాలని జగన్ భావిం చారంటున్నారు. వీరిద్దరి పేర్లతో కూడిన జాబితా అధికారికంగా వెల్లడి కానప్పటికీ అంతర్గతంగా వైసీపీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. అధికారి కంగా అంబటిని చిలకలూరిపేటకు పంపినట్లు గా ప్రకటిస్తే.. బదిలీ అయిన మంత్రులు ఆది మూలపు సురేశ్, విడదల రజిని, మేరుగ నాగార్జునల సర సన అంబటి కూడా చేరుతారు. సిట్టింగ్ స్థానంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొం టున్న ఎమ్మెల్యేలను కొత్త స్థానానికి మారి స్తే ఆ వ్యతిరేకత తగ్గుతుందని జగన్ అభి ప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యం లోనే అటువారిని ఇటు.. ఇటు వారిని అటు మా రుస్తూ కొత్త రాజకీయ క్రీడకు జగన్ తెర తీశారని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



ఇటలీ వెళ్లిన కల్కి



ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ 'కల్కి 2898 ఏడీ' షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణే, దిశా పటాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటలీలోని అద్భుతమైన లొకేషన్స్‌లో ప్రభాస్, దిశా పటానిపై పాట చిత్రీకరిస్తున్నారు. ప్రభాస్, దిశా పటాని, నాగ్ అశ్విన్ ఇతర యూనిట్ సభ్యులతో దిగిన ఫొటోని బుధవారం మేకర్స్ షేర్ చేశారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కల్కి 2898' చిత్రం మే 9న విడుదల కానుంది.

బైక్ రేసర్‌గా శర్వా



యువ కథానాయకుడు శర్వానంద్ ప్రస్తుతం తన 35వ చిత్రం 'మనమే'లో నటిస్తున్నారు. ఆయనతో 'రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'మహానుభావుడు' చిత్రాలను నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజా చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శర్వా పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆయన 36వ చిత్రం షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. తొలిసారిగా శర్వా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో చిత్రాన్ని చేస్తున్నారు. ఇందులో ఆయన బైక్ రేసర్‌గా నటిస్తున్నారు. మోటో క్రాస్ రేసింగ్ నేపథ్యంలో కుటుంబంలోని మూడు తరాలకు చెందిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్నారు. శర్వానంద్, హీరోయిన్ మాళవిక నాయర్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు చిత్ర సమర్పకుడు విక్రమ్ తొలి క్లాప్ ఇచ్చారు. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, ఫొటోగ్రఫీ: జె.యువరాజ్, ఎడిటర్: అనిల్ కుమార్, రచన, దర్శకత్వం: అభిలాష్ కంకర.

ఈ పుట్టినరోజు సందర్భంగానే శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం 'మనమే'. 37వ చిత్రం డిటైల్స్, లుక్స్ విడుదల చేశారు.

మొదట ఎన్టీఆర్.. ఇప్పుడు రామ్‌చరణ్



అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటించే రెండో తెలుగు చిత్రం కూడా కన్‌ఫర్మ్ అయింది. జూనియర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న ఆమె తాజాగా రామ్‌చరణ్ హీరోగా నటించే 16వ సినిమాలో కథానాయికగా నటించనున్నారు. జాన్వీ ఈ చిత్రం చేస్తుందనే వార్తలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఆమె తండ్రి బోనీ కపూర్ ఇటీవల ఈ విషయం వెల్లడించారు కూడా. జాన్వీ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వద్ది సినిమాస్ అధినేతలు అధికారికంగా ఈ విషయం వెల్లడించారు. దర్శకుడు బుచ్చిబాబు సాన ఈ సినిమా కోసం యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత వెంకట సతీశ్ కిలారు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/Ifp8YM3 లో చదవండి.

భీమ పాత్రను ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు హర్ష



గోపీచంద్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' ఈ శుక్రవారం విడుదలవుతోంది. కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వం వహించారు. విడుదల సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటిస్తూ 'నేను బెంగళూరులో పుట్టి పెరిగాను. ఇప్పటివరకూ కన్నడ చిత్రాలే చేశాను. తెలుగులో రాధామోహన్ గారి 'బెంగాల్ టైగర్' చిత్రంలో రెండు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఆయనే నన్ను తెలుగులో దర్శకుడిగా పరిచయం చేస్తుండడం ఆనందంగా ఉంది. గోపీచంద్‌గారికి మొదట ఒక కథ చెప్పాను. ఆయన కొన్ని మార్పులు చెప్పారు. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకుని 'భీమ' కథ చెప్పాను. అది ఆయనకు నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్, ఎలివేషన్, ఎమోషన్ కలిగిన మంచి కమర్షియల్ సినిమా ఇది. సోషల్ మెసేజ్‌తో పాటు సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా ఉంది. ముఖ్యంగా భీమ పాత్ర చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది' అని చెప్పారు. గోపీచంద్ వండర్‌ఫుల్ ఆర్టిస్ట్ అని చెబుతూ 'ఆయన సినిమాలన్నీ చూశాను. తనకి యూనిక్ బాడీ లాంగ్వేజి ఉంది. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. చాలా పాజిటివ్. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. భీమ పాత్ర ఆయనకే సూట్ అవుతుందని ఆయనకే చెప్పాను' అన్నారు హర్ష. నిర్మాత రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న వ్యక్తి అనీ ఈ సినిమాకు కావాల్సిన వన్నీ సమకూర్చడంతో మంచి క్వాలిటీతో సినిమా తీయగలిగినట్లు ఆయన తెలిపారు.

సైన్స్ ఫిక్షన్ దర్శిని



వికాస్ జీకే, శాంతి హీరో హీరోయిన్లుగా రూపుదిద్దుకున్న 'దర్శిని' చిత్రం త్వరలో విడుదల కానుంది. డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో డాక్టర్ ఎల్వీ సూర్యం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం టీజర్‌ను పార్లమెంట్ సభ్యుడు ఎం.వి.వి. సత్యనారాయణ విడుదల చేసి సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన సైన్స్ ఫిక్షన్ ఇది. సినిమా బాగా వచ్చింది. పాటలు చిత్రానికి ప్లస్ అవుతాయి.' అన్నారు. ఓ ప్రముఖ పంపిణీ సంస్థ ద్వారా త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. టీజర్, పాటలు చూసి ఆశీర్వదించిన ఎంపీ సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

జల సంరక్షణ విధానాలు

దేశంలో ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** బిహార్+ఉత్తరప్రదేశ్
- **దామోదర్ వ్యాలీ ప్రాజెక్ట్:** జార్ఖండ్+వెస్ట్ బెంగాల్
- **రామ్ గంగా:** ఉత్తరాఖండ్+ఉత్తరప్రదేశ్
- **చంబల్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+రాజస్థాన్
- **ఇందిరాసాగర్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+గుజరాత్
- **సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్:** గుజరాత్+రాజస్థాన్+మధ్యప్రదేశ్+మహారాష్ట్ర

అంతర్జాతీయ ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **మహాంకాళి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **కోసి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **సంకోష్ ప్రాజెక్ట్:** ఇండియా+భూటాన్
- **తనక్ పూర్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్

భారతదేశంలో సంప్రదాయ నీటిపారుదల, జల సంరక్షణ విధానాలు

- **జింగ్:** కరిగిన హిమనీ నదాల నీటిని సేకరించడానికి నిర్మించిన ట్యాంక్‌లు. ఇవి లడక్‌లో ఉన్నాయి.
- **నౌల:** ఉత్తరాఖండ్‌లో చుట్టుపక్కల ప్రవాహాల నుంచి నీటిని సేకరించడానికి నిర్మించిన చిన్న చిన్న బావులు
- **ఖుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన కాలువలు
- **గుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు
- **బౌడి:** హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్పూర్, కాంగ్రా, మండి జిల్లాల్లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను సేకరించడానికి ప్రత్యేకంగా నిర్మించిన బావులు.
- **నావ్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో తాగునీటి కోసం, ఇంటి అవసరాల కోసం నిర్మించిన బావులు.
- **ఖత్రి:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే వర్షపు నీటిని సేకరించడానికి రాళ్లతో నిర్మించిన బావులు
- **డిఘీ:** ఢిల్లీ ప్రాంతంలో నిర్మించిన చిన్న చిన్న బావులు లేదా కుంటలు
- **అహర్-పైన్స్:** అహర్- బిహార్‌లో వర్షపు నీటిని మళ్లించి నిల్వచేసేందుకు నిర్మించిన జలాశయాలు. పైన్స్-అహర్...జలాశయాల నుంచి నీటిని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించడానికి నిర్మించిన చిన్న చిన్న నీటిపారుదల కాలువలు.
- **అపతాని:** అరుణాచల్ ప్రదేశ్‌లో ఉపరితల, భూగర్భ జలాలను ఉపయోగించి వరి, చేపల పెంపకం చేపట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతులు
- **జబో/రుజా:** నాగాలాండ్‌లో వరద ప్రవాహాన్ని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన కాలువలు.
- **చీవ్-ఓజిహి:** నాగాలాండ్‌లో కొండ వాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన అతి పొడవైన వెదురు పైపుల కాలువలు.
- **తుయ్ ఖుర్:** మణిపూర్, మిజోరాంలలో ఉన్న నీటి బుగ్గలు
- **వెదురు డ్రిప్:** మేఘాలయాలో వాలుల వెంబడి ప్రవహించే నీటిని సేకరించి అత్యధిక దూరంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు నీటిని తీసుకెళ్లే వెదురు పైపులు.
- **డాంగ్స్:** అసోంలోని బోడో తెగలు ఉపయోగించే నీటి కుంటలు



- **గర్-దార:** చుట్టుపక్కల ఉండే నీటి ప్రవాహాల నుంచి నీటిని సేకరించి నిల్వ ఉంచే అతిపెద్ద బావులు
- **డంగ్స్/జంపోయిస్:** పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురిలో వరి పొలాల కోసం ఏర్పాటు చేసిన నీటి కాలువలు
- **ఇనుండేషన్ ఛానెల్స్:** పశ్చిమ బెంగాల్‌లో వరద ప్రవాహాన్ని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు.
- **పాట్:** మధ్యప్రదేశ్‌లోని బాబువ ప్రాంతంలో నీటి ప్రవాహాలను మళ్లించడానికి నిర్మించిన కట్టలు.
- **కటాస్/బందాస్:** ఒడిశాలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **హవేలి:** మధ్యప్రదేశ్‌లోని వ్యవసాయ క్షేత్రాలలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **కుయిస్/బెరీస్:** రాజస్థాన్‌లో వర్షపు నీటిని సేకరించేందుకు ఏర్పాటు చేసిన లోతైన గుంతలు
- **బావోరీస్/బెర్స్:** రాజస్థాన్‌లో ప్రధానంగా తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బావులు
- **పార్:** రాజస్థాన్‌లో లోతైన గుంతలలో(బెరీస్) నిల్వ చేసిన నీటిని వాడుకునే ప్రాంతం
- **కుండ్స్/కుండీస్:** రాజస్థాన్‌లోని పాళీ ప్రాంతంలో సాసర్ ఆకారపు పరివాహపు ప్రాంతాన్ని కలిగిన వలయాకారపు భూగర్భ బావులు
- **తలాబ్/నాడి:** రాజస్థాన్‌లోని జోద్‌పూర్ ప్రాంతంలోని గ్రామాలలో నిర్మించిన నీటి కుంటలు.
- **టంకాలు:** బికనీర్ ప్రాంతంలో గృహాలలో తాగునీటి కోసం సున్నపురాయితో నిర్మించే బావులు
- **బావోళి/బావడి:** రాజస్థాన్‌లో దిగుడు మెట్ల బావిని పోలిన నిర్మాణాలు. వీటినే 'వావ్' లేదా 'వారది' అని గుజరాత్‌లో పిలుస్తారు.
- **జోహాడ్స్:** రాజస్థాన్‌లో వాలుకు అనుగుణంగా మూడు వైపులా కట్టలు నిర్మించి ఒక వైపున నీరు ప్రవహించడానికి అనువుగా నిర్మించిన నిర్మాణాలు. వర్షపు నీరు భూమిలోనికి ఇంకడానికి ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయి.
- **పాడ్, భాండారాలు:** మహారాష్ట్రలోని తపతి నది పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. బందారా అంటే చిన్న వాగుల మీద అడ్డంగా కట్టిన కట్టలు. వాటి నుంచి కాలువలు తవ్వి, నీటిని వ్యవసాయ భూములకు తరలిస్తారు. ఈ వ్యవసాయ భూములను పాహడ్స్ అంటారు.

నోట్: తమిళనాడు రాష్ట్రం మొట్ట మొదటి సారిగా వర్షపు నీటిని నిల్వ చేయటాన్ని చట్టంగా చేసింది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

ఏపీ ఐసెట్ నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)-ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; బీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 7
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 28 నుంచి 29 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 2 నుంచి
- **ఏపీ ఐసెట్ 2024 తేదీలు:** మే 6, 7
- **ఫలితాలు విడుదల:** జూన్ 20
- **వెబ్‌సైట్:** cets.apsche.ap. gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/eXWZjTIలో చదవండి.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సంస్థలు అందిస్తున్న మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన 'నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (నిమ్‌సెట్) 2024' నోటిఫికేషన్ వెలువడింది. దీనిని నిట్ జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఇందులో ఐఐఐటీ భోపాల్ సహా వరంగల్, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచిరాపల్లి, కురుక్షేత్ర, అగర్తల, జంషెడ్‌పూర్, భోపాల్, అలహాబాద్, పట్నా నిట్‌లు పార్టిసిపేట్ చేస్తున్నాయి. నిమ్‌సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

నిట్ ఎంసీఏలో ప్రవేశానికి నిమ్‌సెట్

సీట్ల వివరాలు: మొత్తం 1033 సీట్లు ఉన్నాయి. వరంగల్ నిట్‌లో 58, తిరుచిరాపల్లి నిట్‌లో 115, సూరత్కల్ నిట్‌లో 58, రాయ్‌పూర్ నిట్‌లో 110, కురుక్షేత్ర నిట్‌లో 96(వీటిలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ సీట్లు 32), జంషెడ్‌పూర్ నిట్‌లో 115, భోపాల్ ఎంఏఎన్‌ఐటీలో 115, అలహాబాద్ ఎంఏఎన్‌ఐటీలో 116, అగర్తల నిట్‌లో 30 సీట్లు ఉన్నాయి. పట్నా నిట్‌లో డేటా సైన్స్&ఇన్ఫర్మాటిక్స్ 80, ఏఐ&ఐఓటీ 80 సీట్లు ఉన్నాయి. సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద ప్రతి స్పెషలైజేషన్‌లో సగం సీట్లు కేటాయించారు. భోపాల్ ఐఐఐటీలో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు; బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు; ఓపెన్ యూనివర్సిటీల నుంచి దూరవిద్య విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

నిమ్‌సెట్ వివరాలు: ఈ పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 70 నిమిషాల పరీక్ష సమయం ఉంటుంది. రెండో పార్ట్‌లో అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 30 నిమిషాల సమయం ఇస్తారు. మూడో పార్ట్‌లో కంప్యూటర్ అవేర్‌నెస్ నుంచి 20, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 20 నిమిషాల సమయం ఇస్తారు. మేథమెటిక్స్ ప్రశ్నలకు ఒక్కోదానికి 12 మార్కులు; అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రశ్నలకు ఒక్కోదానికి 6 మార్కులు; జనరల్ ఇంగ్లీష్ ప్రశ్నలకు ఒక్కోదానికి 4 మార్కులు కేటాయించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 1000. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.nimcet.in, www.nimcet.admissions.nic.in



ఖిద్మత్ టీం అధ్యక్షుడు షఫీకి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నారా లోకేశ్

టీడీపీలో చేరిన ఖిద్మత్ టీం అధ్యక్షుడు షఫీ

- మరో 200 కుటుంబాలు టీడీపీలో చేరిక .. ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరిసిటీ, మార్చి6: ఖిద్మత్ టీం వ్యవస్థాపక అధ్యక్షుడు, మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన షేక్ షఫీ బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో తన అనుచరులు, మద్దతుదారులైన రెండొందల మందితో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఖిద్మత్‌టీం ద్వారా షఫీ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ దగ్గరయ్యారు. కొవిడ్ సమయంలో అనాథ, పేద కుటుంబాలకు చేయూతనందించి, అనాథ శవాలకు దహన సంస్కారాలను ఖిద్మత్‌కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. అధికారంలో లేకపోయినా మంగళగిరిలో లోకేశ్ ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో లోకేశ్ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని షఫీ పేర్కొన్నారు.

వీరితోపాటు దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన 25 దళిత కుటుంబాలు, మరో 25 యాదవ సామాజికవర్గ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ పార్టీలో చేరుతున్న వారికి రాబోయే రోజుల్లో తగిన ప్రాధాన్యతనిస్తామని లోకేశ్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జానకీదేవి, రాజు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ అశోక్ (ఫైల్)

చిలకలూరిపేట,మార్చి6:యడ్లపాడు పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎన్.అశోక్(35) బుధవారం చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కోటప్పకొండలో విధి నిర్వహణలో పాల్గొన్న అనంతరం ద్విచక్రవాహనం పై తిరిగి చిలకలూరిపేటకు వస్తుండగా పట్టణ పరిధిలోని సింగ్‌నగర్ వద్ద మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. గుంటూరులో నివాసం ఉంటున్న అశోక్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచారు. కాగా ప్రమాద వార్త తెలిసిన వెంటనే చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, అర్బన్ సీఐ పీ రమేష్, అర్బన్ ఎస్ఐలు సుబ్బారావు, సుమన్, ఇతర పోలీసు సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు.

తిరునాళ్లకు.. చేరుకోండిలా..



నరసరావుపేట, మార్చి 6: కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలను భక్తులు పాటించాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి బుధవారం సూచించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సంత మాగులూరు వైపు నుంచి కోటప్పకొండకు వచ్చే రహదారులు, పార్కింగ్ స్థలాల వివరాలు వెల్లడించారు.

- నరసరావుపేట నుంచి కోటప్పకొండకు వచ్చే భక్తులు, వీఐపీలు వారి వాహనాలు, ఆర్టీసీ బస్సులలో ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వెనుక ఏర్పాటుచేసిన మట్టి రోడ్డును ఉపయోగించుకొని కొండకావూరు మీదుగా పమిడిమర్రు రోడ్డును చేరి జెఎన్‌టీయూ కాలేజీ మీదుగా వినుకొండ రోడ్డుకు చేరుకోవాలి.
- ప్రకాశం జిల్లా సంతమాగులూరు వైపు నుంచి వచ్చే భక్తులు లక్ష్మీపురం కాలువ రోడ్డు, మిన్నెకల్లు, గురిజేపల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. మిన్నెకల్లు నుంచి కోటప్పకొండవైపు వాహనాలు అనుమతించబడవు. తిరుగుప్రయాణంలో గురుజేపల్లి మీదుగా సంతమాగులూరు వెళ్లాలి.
- చిలకలూరిపేట వైపే నుంచి వచ్చే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ జంక్షన్‌చేరి శారద ఫార్మసీవద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలను ఉపయోగించుకోవాలి. ఈ మార్గంలో వచ్చే వీఐపీలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి ఎడమవైపుకు క్రషర్ రోడ్ మీదుగా వీఐపీ పార్కింగ్‌లో వాహనాలు ఉంచాలి. తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్‌ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు నుంచి చిలకలూరిపేట వెళ్లాలి.
- చిలకలూరిపేట నుంచి వెళ్లే ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ మీదుగా నిధి దారి గుండా ప్రభల నిలిచే స్థలానికి తరలించాలి. చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టలఫ్యాక్టరీ రోడ్డు మీదుగా యక్కలవారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్‌కు చేరాలి.
- చిలకలూరిపేట వైపు తిరిగి వెళ్లే భక్తులు శారద ఫార్మసీ దగ్గరలో పార్కింగ్ నుంచి ఆర్టీసీ బస్సులు, కార్లు యూటీ జంక్షన్ చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం, గోవిందాపురం, కోమటినేనివారి పాలెం మీదుగా నరసరావుపేట- చిలకలూరిపేట రోడ్డు నుంచి చిలకలూరిపేట వెళ్లాలి.
- గంగన్నపాలెం, కోమటినేనివారి పాలెం నుంచి వచ్చు భక్తులు గోవిందాపురం, కమ్మవారిపాలెం మీదుగా మద్దిరాల చేరి యడవల్లి, యూటీ జంక్షన్‌ల మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరాలి.
- అవిశాయపాలెం, కేసానుపల్లిమీదుగా కోటప్పకొండకువచ్చే భక్తులు ఎస్‌ఆర్‌కేటీ యలమంద గ్రామం మీదుగా కోటప్పకొండకు వెళ్లాలి.
- యలమంద, గురువాయపాలెంవైపు నుంచి వచ్చే భక్తులు బాతింగ్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జ్‌ను చేరి, యాదవ సత్రానికి వెనుక పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కు చేసుకొనవలెను.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి నరసరావుపేటకి వెళ్లే వాహనాలు, చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటు చేసిన రూట్‌లో మాత్రమే వెళ్లి ఏఎంరెడ్డి కాలేజి వద్ద నరసరావుపేట బైపాస్‌కు వెళ్లాలి. గురవాయపాలెం, యల్లమంద మీదుగా నరసరావుపేటవైపునకు వెళ్ళుటకు వాహనాలు అనుమంతించబడవు.
- నరసరావుపేట టౌన్ నుంచి కోటప్పకొండకి వచ్చే ప్రభలు ఉదయం 10 గంటలకు బయలదేరి వయా యల్లమంద, గురవాయపాలెంమీదుగా సాయంత్రం 4గంటలకి ప్రభల నిధికి చేరుకోవాలి.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి రాత్రి 1 గంట తర్వాత తిరిగి వెళ్ళే వాహనాలు ఐరన్ బ్రిడ్జి మీదుగా గోనేపూడి, కేసానుపల్లి మీదుగా నరసరావుపేట, చిలకలూరిపేట వైపుకు గానీ వెళ్ళ వచ్చు.
- ఏఎంరెడ్డి కాలేజ్ జంక్షన్ నుంచి కాలుకట్ట పైకి అనుమతి లేదు.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక యాప్

కోటప్పకొండ తిరునాళ్ళకు వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగు చేసుకోవడానికి పల్నాడు జిల్లా పోలీసు వారిచే ఏర్పాటు చేసిన కోటప్పకొండ పార్కింగ్ యాప్‌ను గూగల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని హోం పేజీలో కనపడే బైక్, ఆటో, కార్, ట్రాక్టర్ గుర్తులపై టచ్‌చేసే మీకు దగ్గరలోని పార్కింగ్ స్థలాలను సూచిస్తుంది. వాటిలో అందుబాటులో ఉన్న పార్కింగు ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

కోటప్పకొండకు 100 ప్రత్యేక బస్సులు

చిలకలూరిపేట అర్బన్, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ వెళ్ళే యాత్రికులకు డిపో నుంచి 100 ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు తెలిపారు. సుమారు లక్షమంది ప్రయాణీకులను కోటప్పకొండకు చేర్చినందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వలంటీర్లు, డ్రైవర్లు మొబైల్ టీంల సేవలను వినియోగించుకొని ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ ట్రాఫిక్ చీఫ్ మేనేజర్ ఎం.ఇబ్రహీం పాల్గొన్నారు.



కోడెల విగ్రహానికి నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు, డాక్టర్ అరవిందబాబు, మక్కెన మల్లికార్జునరావు, తదితరులు

ఘనంగా కోడెల విగ్రహావిష్కరణ

నరసరావుపేటటౌన్, మార్చి 6 : నరసరావుపేట మండలం కోటప్పకొండ కాకతీయ సేవాసమితి ఆవరణలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహ ఆవిష్కరణ బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ వినుకొండ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, అట్లా చిన వెంకటరెడ్డి, డాక్టర్ కోడెల శివరామకృష్ణ, సాదినేని కోటేశ్వరరావు, పున్నయ్య, మస్తానయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడల శివరామకృష్ణ మాట్లాడుతూ కోటప్పకొండలో, కాకతీయ సత్రంలో జరుగుతున్న ప్రతి అభివద్ధి వెనుక కోడెల శివప్రసాదరావు ఉన్నారన్నారు. అన్నదానంతో కులమతాలకు అతీతంగా ఆదరించాలని డాక్టర్ కోడెల తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయం అన్నారు. కార్య క్రమంలో అనుమోలు వెంకయ్యచౌదరి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల,మార్చి6: రేపటి టీడీపీ, జనసేన ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలోబీసీలకు పెద్ద పీట వేయటం జరుగుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి వద్ద జరిగిన జయహో బీసీ భారీ బహిరంగసభలో ఆమోదించిన బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలో లక్షలాది మంది బీసీలకు మేలు జరుగు తుంద న్నారు. రాష్ట్రంలో టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పాటయ్యాక బీసీలలో 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4వేల పింఛన్ ఇస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి 16,800 మందిని పదవులకు దూరం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక బీసీల రిజర్వేషన్‌ను 34 శాతం పునరుద్ధరిస్తామని యరప తినేని తెలిపారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరించడంతో పాటు పెళ్లికానుక లక్ష రూపాయలు పెంచడం, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌లో పొందుపరచిన పథకాలను వారికే అమలయ్యేలా చేయనున్నట్లు యరపతినేని తెలిపారు.



న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆలపాటి రాజా

భూహక్కు చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

- మాజీ మంత్రి ఆలపాటి రాజా
- న్యాయవాదుల దీక్షలకు మద్దతు

గుంటూరు(లీగల్), మార్చి6: హైకోర్టు ఎన్నిసార్లు చివాట్లు పెట్టిన ఈ ముఖ్యమంత్రికి, ప్రభుత్వ అధికారులకు బుద్ధి రావటం లేదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. భూ హక్కు చట్టం రద్దు చేయాలని డిమాండ్‌తో గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన నిరసనలు బుధవారం 60వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి మస్తాన్‌వలి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరెళ్ళ సురేష్ తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ సామాన్య పౌరులకు రాజ్యాంగబద్ధమైన పాలన అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయవాదులపైనే ఉందని చెప్పారు. ప్రజల ఆస్తిపత్రాలపై ముఖ్యమంత్రి ఫొటోలు పెట్టడం తుగ్లక్ చర్య అని పేర్కొంటూ భూహక్కు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, రేపు ప్రభుత్వం మారిన వెంటనే దీనిని రద్దు చేస్తారని తెలిపారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ భూహక్కు చట్టంలో ఎన్నో లోపాలు ఉన్నాయని, ఈ చట్టం అమలులోకి వస్తే అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని చెప్పారు. గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో బుధవారం పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొని భూహక్కు చట్టం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

జయహో బీసీ సభ ఓ సంచలనం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 6: నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జరిగిన బీసీ సభ దేశంలోనే ఒక సంచలనం సృష్టించిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీవీ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, అచ్చెన్నాయుడు, పెద్దలందరూ పాల్గొన్న ఈ గొప్ప సభ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. బీసీలది యాచించే స్థాయి కాదని శాసించే స్థాయికి వారిని అభివృద్ధి చేయటం చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ లక్ష్యం అన్నారు. రాజకీయాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించింది అన్న ఎన్‌టీఆర్, టీడీపీ అన్నారు. ఎన్టీ రామారావు మొదటి బీసీలకు 24 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చి వాళ్ళకు కొండంత అండగా నిలబడ్డారని, చంద్రబాబు వచ్చిన తర్వాత దానిని 34 శాతానికి పెంచి మరింత సామాజిక న్యాయం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వందలాది మందిని హత్య చేయించి పొట్టన పెట్టుకున్నాడని విమర్శించారు. బీసీల వెన్నెముక విరగగొట్టాలని 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించారన్నారు. జయహో బీసీ సభ జరిగిన తర్వాత జగన్‌రెడ్డి వణికి పోతున్నారన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం, చంద్రబాబును సీఎంని చేసుకోవాలని కోరారు. సమావేశంలో టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు, మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, అట్లా చిన వెంకటరెడ్డి, కుమ్మెత కోటిరెడ్డి, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, వెంకట నరసయ్య, కొండలు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరామిరెడ్డి, కొట్టా కిరణ్‌కుమార్, కొల్లి బ్రహ్మయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్‌బాబు, పులుకూరి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములపై వైసీపీ రాబందులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రకుమార్

- అసైన్డ్ భూములు కాజేయడానికే జగన్ ఆర్డినెన్స్
- కలెక్టర్ సహకారంతోనే కిలారి భూదోపిడీ
- కిలారిపై విచారణ జరిపించాలి
- మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయింది మొదలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఆయన, ఆయన అనుచరులు పేదల భూములను రాబందుల్లాగా తన్నుకుపోతున్నారని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దళితులు తమ ఆర్థిక అవసరాలనిమిత్తం తమకు అసైన్ చేసిన భూములు అమ్ముకోవచ్చని సవరణ చేసి ఆ భూములను కాజేసేందుకు జగన్, ఆయన అనుయాయులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాగానే వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డంపెట్టుకొని దళితుల భూములను లాక్కోవడానికి కలెక్టర్‌తో సహా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూములను తమ బినామీ పేర్ల మీదకు మార్చేశారన్నారు. సుప్రీంకోర్టు నియమ, నిబంధనలు తుంగలోతొక్కి జీవో తెచ్చి బినామిలా పేర్లతో కొట్టేయడం మొదలుపెట్టారన్నారు. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని అనుమర్లపూడి గ్రామంలో 1972 నుంచి 2022 వరకూ దళితుల పేరున వున్న 30 ఎకరాల అసైన్డ్‌భూమిని దోపిడీచేసేందుకు కలెక్టర్ సాయంతో వైసీపీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య తెరలేపారన్నారు. 2011-12లో రెవెన్యూ అధికారులు దళితుల పేర ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను నేడు 22ఏ కింద తొలగించమని కలెక్టర్ ఏవిధంగా ఆదేశాలిచ్చారో చెప్పాలని డిమాండ్‌చేశారు. అసైన్‌దారుల వారసులకు మాత్రమే హక్కులుండే ఆ భూములకు వారసులను వైసీపీ నేతలే సృష్టించి రూ.50 కోట్లు విలువ చేసే విలువైన భూములు 30 ఎకరాలు దోపిడి చేశారన్నారు. దళితుల భూములు దోచుకున్న కిలారుపై విచారణ చేయించే ధైర్యం సీఎంకి ఉందా అని సవాల్ విసిరారు. దళితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రాజామాస్టారు, ఇమ్మానుయేల్, డి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, సాయికృష్ణ, మురళీకృష్ణ, హుస్సేన్, ఫిరోజ్, హజార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఏడు గృహాలు అగ్నికి ఆహుతి

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం
- నిరాశ్రయులైన తొమ్మిది కుటుంబాలు
- బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ పరామర్శ..



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, మార్చి6: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అర్ధరాత్రి చెలరేగిన మంటలతో ఏడు గృహాలు కాలి బూడిదకాగా తొమ్మిది కుటుంబాలు నిరాశ్రయులలైన ఘటన పొన్నూరు పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో పట్టణంలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో ఈ ప్రమాదం సంభవించింది. దీంతో ఇళ్లలోని వస్తు సామగ్రి, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ఏడు గృహాల్లో నివసిస్తున్న తొమ్మిది కుటుంబాల వారు నిరాశ్రయులు అయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో తలపల శ్రీను, కొమరగిరి మల్లేశ్వరరావు, తలపుల భారతి, పొదిలి కృష్ణ, శ్రీను, అడ్డూరి శ్రీనివాసరావు, శివ మల్లిఖార్జునరావు, సరోజనమ్మ, చెల్లంచర్ల పోలమ్మలకు చెందిన గృహాలు దగ్ధమయ్యాయి.

బాధిత కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు సాయాన్ని టీడీపీ నేతల ద్వారా అందచేశారు. ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి అన్ని రకాలుగా ఆదుకోవాలని నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, తట్ట బులయ్య, మస్యం ఆంజనేయులు, నడికట్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ బాధిత కుటుంబాలను పరామర్శించి బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున సహాయం అందించారు.

అమరావతిపై జగన్‌రెడ్డి అసత్య ప్రచారం

- సీఎం అండ్ కో లబ్ధికోసమే విశాఖ జపం
- 1541వ రోజుకు రైతులఆందోళనలు



తుళ్లూరు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 6: రాజధాని అమరావతి నిర్మాణానికి వేల కోట్లు రూపాయలు కావాలని సీఎం జగన్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నాడని, సెల్ఫ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూపాయి పెట్టుబడి పెట్టే పనిలేదని రాజధాని నిర్మాణానికి భూములు త్యాగంచేసిన రైతులు తెలిపారు. బిల్డ్ అమరావతి అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1541వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి ఎన్ని ఎత్తుగడలు వేసి విష ప్రచా రాలు చేసినా అమరావతిని నాశనం చేయలేడని, అమరావతే రాష్ట్ర రాజధాని అని స్పష్టం చేశారు. సీఎం జగన్‌రెడ్డి అండ్ కో లబ్ధికోసమే విశాఖ జపం చేస్తున్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని ప్రాంత గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00



కృష్ణానది స్నానఘాట్‌లో జల్లు స్నానానికి ఏర్పాటు చేసిన పైపులైన్

శివరాత్రి వేడుకలకు అమరేశ్వరాలయం సిద్ధం

అమరావతి, మార్చి 6: మహా శివరాత్రి ఉత్సవాలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 8న మహాశివరాతిర పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివార్లను పెళ్లికుమారుడిగాచేయగా బుధవారం వివిధ పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణచేశారు. భక్తుల సౌకర్యార్థం క్యూలు, షామియానాలు, ప్రసాదాలను సిద్ధంచేస్తున్నారు. ప్రధాన రాజగోపురంతో పాటు వివిధ ఆలయ శిఖరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం అడుగంటడంతో జల్లు స్థానానికి షవర్లు ఏర్పాటు చేశారు.

ఎక్సైజ్ డీసీగా బాబ్జీరావ్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌వీవీఎన్ బాబ్జీ రావు

గుంటూరు(కార్పొరేషన్),మార్చి6: గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీవీఎన్ బాబ్జీరావ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ డీసీగా ఉన్న టి.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాబ్జీరావ్ వైజాగ్ డీసీగా పని చేస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు. ఇక్కడ వున్న శ్రీనివాసరావును విజయవాడ ఏపీఎస్ బీసీఎల్‌లో డీజీఎంగా బదిలీచేశారు. ఈసందర్భంగా ఎస్‌వీవీఎన్ ఎన్ బాజ్జీరావు మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖను పటిష్ట పరిచేందుకు కృషి చేస్తామన్నారు.

1,38,827 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,44,511 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,38,827 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,09,145 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11000	19200
273	10200	18000
341	8500	19000
4884	12000	15000
సూపర్ 10	9500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	20200
బ్యాడిగి	10000	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	12000

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు


పరశురామునిచే ప్రతిష్ఠించిన శివలింగం

దాచేపల్లి, మార్చి 6: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ప్రధానంగా త్రేతాయుగంలో పరశురామునిచే ప్రతిష్ఠ చేయబడిన శివలింగం పొందుగల గ్రామంలో గంటల రామలింగేశ్వర స్వామి వారుగా భక్తులచే నేటికి పూజలందుకుంటున్నారు. కేశానుపల్లిలోని శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి వారు, దాచేపల్లిలోని నాగేంద్ర సహిత గంగా భవాని సమేత ముక్తేశ్వరస్వామి వారి ఆలయం, నారాయణపురంలోని భవాని శంకర స్వామివారి ఆలయాలలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాలకు రంగులు వేయించి విద్యుద్దీపాలను ఏర్పాటు చేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కోటప్పకొండ, అమరావతి, సత్రశాల, గోగులపాడు నీలకంఠయ్య, వాడపల్లి, మట్టపల్లి దేవాలయాలకు రాకపోకలు సాగించే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా స్వామివారి ఆలయాలలో స్వామివారి కల్యాణం, లింగోద్భవ సమయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిగావించారు.

● రెంటచింతల,మార్చి 6 : పల్నాట అతి పురాతనమైన ఆలయం.. విశ్వామిత్రుడు తపస్సు చేసిన ప్రాంతంగా ఖ్యాతిగడించిన సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం శుక్రవారం నిర్వహించే మహాశివరాత్రికి సిద్ధమైంది. సుమారు 30 వేల మంది భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి స్వామి వారి దర్శనానికి రానున్నారు. నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయడానికి 4 అదనపు ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు,వైద్య ఆరోగ్య శిబిరాలు,మైదానం చదును చేయడం లాంటి పనులన్నీ పూరైనట్లు ఛైర్మన్ బ్రహ్మారెడ్డి,ఈవో నెమలిరెడ్డిలు చెప్పారు. రాత్రి వేళ స్వామి వార్ల కళ్యాణం నిర్వహించనున్నారు. వివిధ వర్గాలకు చెందిన 19 అన్నదాన సత్రాల్లో వేలాది మందికి అన్నదానం చేయనున్నారు.

బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమం


బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, మార్చి 6 : పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో బుధవారం జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యాన బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఓటరు మార్పులు, చేర్పులు, హోం ఓటింగ్, పోలింగ్ కేంద్రాలు, మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీకే ప్రసాద్, ఎస్‌వీఎస్ నాగరాజు, కేశవరెడ్డి, నాగరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్, మార్చి 6: డివిజన్ పరిధిలోని అధికారులతో బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ వెరిఫికేషన్ పారదర్శకంగా ఉండాలన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాసరావు, సీఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూడాలి : సీఐ

పిడుగురాళ్ల, మార్చి 6 : రాబోయే సాధారణ ఎన్నిక లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ప్రశాంతంగా జరిగే లా ప్రతి ఒక్కరు సహకరించాలని సీఐ పి.వీరాంజనేయులు తెలిపారు. గుత్తికొండలో బుధవారం పోలీసులు, పారా మిలిటరీ బలగాలు కవాతు నిర్వహించారు. గ్రామస్తులకు ఓటు ప్రాధాన్యత, మద్యం, డబ్బు పంపిణీలకు ప్రలోభపడ కుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు పడితే పోలీసుల రికార్డుల్లో నమోదు జరిగితే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్న విషయాన్ని గుర్తు చేస్తూ అలాంటి పరిస్థితి ఏ ఒక్కరూ తెచ్చుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రబ్బానిఖాన్, అమీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, మార్చి 6: ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతల నిమిత్తం మాచర్లలో బుధవారం సీఐ శరత్‌బాబు ఆధ్వర్యాన పోలీసులు కవాతు నిర్వహించారు. జడ్పీ బాలుర హైస్కూల్ నుంచి మెయిన్ రోడ్డు వరకు కవాతు జరిగింది.

బీసీల రక్షణ చట్టం ఓ వరం : బాలయ్య


చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నాయకులు, కార్యకర్తలు

దాచేపల్లి, మార్చి 6: బీసీల డిక్లరేషన్‌లో భాగంగా ప్రకటించిన బీసీల రక్షణ చట్టం బీసీల పాలిట వరమని, బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కినపల్లి బాలయ్య అన్నారు. బుధవారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. 5వ తేదీన జయహో బీసీ సభలో విడుదల చేసిన బీసీల మేనిఫెస్టో బీసీల జీవితాలలో ఓ సువర్ణ అధ్యాయమన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఈ మేనిఫెస్టో ఎంతో ఊరటనిచ్చిందని తెలిపారు. వైసీపీ పాలనలో బడుగు, బలహీనవర్గాల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రానున్న ఎన్నికలలో వైసీపీని తరిమికొట్టాలని, టీడీపీ, జనసేనను ఆదరించాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బడుగు, బలహీనవర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, బెల్లంకొండ భద్రి, నర్రా పుల్లయ్య, నలబోతుల శ్రీను, గుండా కొండలు, తోట వెంకటేశ్వర్లు, రుద్రాల అచ్చారావు, వేముల కృష్ణ, బండ్ల వెంకటేశ్వర్లు, ముశ్యం శ్రీను, గరికపాటి శివప్రసాద్, గరికపాటి మల్లికార్జునరావు, బొమ్మిరెడ్డి నారాయణ, భాస్కరరావు, నాయబ్ అబ్దుల్లా, అహ్మదా, కూరాకుల నాగేశ్వరరావు, తదితరులున్నారు.

టీటీడీ నుంచి సత్రశాలకు చేరిన పంచలోహ విగ్రహాలు

రెంటచింతల, మార్చి 6 : తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక చొరవతో పలు దేవతా విగ్రహాలు కృష్ణానది ఒడ్డున గల సత్రశాలకు బుధవారం చేరినట్లు ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈవో నెమలిరెడ్డి చెప్పారు. శివరాత్రి సందర్భంగా ఆయా పంచలోహ విగ్రహాలకు శుక్రవారం అభిషేకాలు నిర్వహించి భక్తులకు అందుబాటులోకి తేనున్నట్టు పేర్కొన్నారు. 15 పంచలోహ విగ్రహాలకుగాను తొలుత 8 విగ్రహాలను అందచేశారు. వాటిలో గంగాపార్వతి సమేత శ్రీచంద్రశేఖరమూర్తి, శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి, సువర్చలా అంజనేయస్వామి విగ్రహాలను తీసుకొచ్చామన్నారు. ఈ విగ్రహాలు సత్రశాలకు కేటాయించేలా తీవ్రంగా కృషి చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పీఆర్కేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించిన ఆర్టీసీ డీఎం

రెంటచింతల, మార్చి 6 : మహాశివరాత్రి సందర్భంగా మాచర్ల డిపో నుంచి వివిధ శైవక్షేత్రాలకు ఈ నెల 8వ తేదీ తెల్లవారుజాము నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ పిచ్చయ్య చెప్పారు. బుధవారం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో బస్సులు పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అదనపు చార్జీలు ఉండవని స్పష్టం చేశారు. శ్రీశైలంకు 16, సత్రశాల 32, దైద 3, మన్నెపల్లి 2, తేరాలకు ఒక బస్సు నడుపుతున్నట్టు తెలిపారు. సాగరమాత తిరునాళ్ల నిర్వహించే మూడు రోజులకు గాను 25 సర్వీసులు తిప్పుతామన్నారు. ఈయన వెంట టీఐ మేకపోతుల ముత్యాలరెడ్డి తదితరులున్నారు.

ఫ్యాక్టరీ భూముల వల్లే జగన్‌తో వైరం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని


బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్డులను అందజేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, మార్చి 6: సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ భూముల వలనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, నాకు తగాదా వచ్చిందని, అప్పట్లో రైతులకు అండగా ఉన్నాననే ఉద్దేశంతో నాపై అనేక రకాల కేసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పెట్టించారని, మీ ఆశీస్సుల దయ వల్ల తాను కేసుల నుంచి బయటపడ్డానని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మాచవరం మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో బుధవారం జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో యరపతినేని మాట్లాడుతూ అతి తక్కువ రేట్లకు భూములు కొనుగోలు చేసి గ్రామంలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తానని, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానని చెప్పి ఎన్ని సంవత్సరాలైనా ఫ్యాక్టరీ నిర్మించకపోవడంతో రైతులు భూములను సాగు చేసుకుంటుంటే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 మంది రౌడీమూకలు ట్రాక్టర్లతో దున్నారని, అదేమని ప్రశ్నించిన రైతులపై మారణాయుధాలతో తిరగబడి గాయపరిచారన్నారు. వారికి అండగా ఉన్నందుకే జగన్మోహన్‌రెడ్డి తనపై కక్ష కట్టి అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని యరపతినేని తెలిపారు. ఇటీవల నేను వేరే నియోజకవర్గానికి వెళ్తున్నానని పుకార్లు షికారు చేసి వైసీపీ వాళ్లు సంబరాలు చేసుకున్నారని, ఇదే నియోజకవర్గంలో 7వ సారి పోటీ చేసి గెలుపొంది వారి సంబరాలకు ధీటుగా మనం చేసుకుందామని స్పష్టం చేశారు. ఐదేళ్ల సైకో పరిపాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారన్నారు. రెండు నెలల తరువాత టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సుగాలీల కులదేవత సేవాలాల్ మహారాజ్ దేవాలయాన్ని అధికారంలోకి రాగానే నిర్మించి తీరుతానని చెన్నాయపాలెం గ్రామస్తులకు హామీ ఇచ్చారు. చెన్నాయపాలెం గ్రామంలో రెండు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని, అవసరమైతే ఇంకొక ట్యాంకర్ కూడా ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా తీరుస్తామన్నారు. గురజాలలో తాను కూడా సూపర్ 6 పథకాలను ప్రవేశపెడతానని అన్నారు. ముందుగా గ్రామంలోని ఇంటింటికి తిరిగి పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. చెన్నాయపాలెం గ్రామస్తులు, సుగాలీ మహిళలు డ్యాన్స్‌లు, నృత్యాలతో యరపతినేనికి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, జనసేన అధ్యక్షులు బొమ్మా శ్రీనివాసరావు, యడ్లపల్లి రామారావు, బొగ్గవరపు అంజయ్య, యలమందానాయక్, మాలపాటి మల్లయ్య, కొలగాని శివ, వై.ఆనందరావు, జి.లక్ష్మీనారాయణ, జి.గంగాధర్, అంజిరెడ్డి, పి.సత్యనారాయణ, పలు గ్రామాల టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు మేలు : మున్నా

మాచర్ల రూరల్, మార్చి 6 : టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు యాదవ్ అన్నారు. పట్టణంలోని బీసీ సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళగిరి బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీసీల అభివృద్ధి కోసం ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. జనసేన అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, గుండాల శ్రీనివాస్ యాదవ్, సంబోజు వేణు, బండారు కృష్ణవేణి, కోమటి వీరు, కొమెర అనంతరాములు, మున్నా హనుమంతు, బీమవరపు శ్రీనివాసరావు, బృంగా ఆంజనేయులు, జనసేన నేత మదీన్ తదితరులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి, మార్చి 6: జయహో బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని శిరిగిరిపాడులో వారు విలేకరులతో మాట్లాడారు. బీసీల అభివృద్ధి కొరకు చంద్రబాబు 10 ముఖ్యమైన పథకాలను మేనిఫెస్టోలో చేర్చారన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యాన వేలాది మంది బీసీ సభకు హాజరై జయప్రదం చేశారన్నారు. కార్యక్రమంలో రాజబోయిన మధు యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాతులూరి కుమార్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రావులకొండలు, జడ్పీటీసీ రామాంజిరెడ్డి, సామినేని సిద్ధయ్య, రాజబోయిన గోవిందు, మేడబోయిన పిచ్చయ్య పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 6 : జయహో బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీసీలకు కురిపించిన వరాలకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, పట్టణ మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, షేక్ మోదీన్‌షా, పట్టణ ఉపాధ్యక్షుడు నాగవరపు రాముడు, షేక్ నన్నేసా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మిరెడ్డి, షైపులు జాని తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ

మాచర్ల రూరల్, మార్చి 6 : పట్టణంలోని 22వ వార్డులో బుధవారం టీడీపీ, జనసేన నేతలు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ, జనసేన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మహిళా అధ్యక్షురాలు బండారు కృష్ణవేణి, బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బత్తుల రమణ, మైనార్టీ నేత షైన, జనసేన నేతలు కొమెర లాలాగౌడ్, షేక్ మదిన్ పాల్గొన్నారు.

సాగరమాత ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

మాచర్ల రూరల్, మార్చి 6 : మండలంలోని విజయపురిసౌత్‌లో ఉన్న సాగరమాత ఉత్సవాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం పిచ్చయ్య తెలిపారు. ఉత్సవాలు గురువారం నుంచి మూడు రోజులపాటు జరుగుతాయన్నారు. అలాగే మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీశైలం, సత్రశాల, దైద, తేరాల, మన్నెపల్లి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని చెప్పారు.

హైస్కూల్‌కు ప్రింటర్ అందజేత

క్రోసూరు, మార్చి 6 : మండలంలోని 88 తాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బుధవారం స్నేహ హస్తాల ఫౌండేషన్, ఉపాధ్యాయులు పసుమర్తి పద్దయ్య సంయుక్తంగా ప్రింటర్ అందజేశారు. గ్రామ సర్పంచ్ తలకోటి ఎలిశమ్మ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడికి ప్రింటర్‌ను అందించారు. ఇది పాఠశాలకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ అన్నారు.

టీడీపీకి వెన్నుముక బీసీ వర్గాలే : యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 6 : టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలోనే బీసీ వర్గాలకు ఎంతో ఆదరణ ఇచ్చారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్, జ్యోతిరావుఫూలే చిత్రపటాలకు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. యరపతినేని మాట్లాడుతూ టీడీపీకి బీసీ సామాజికవర్గాలే వెన్నుముక అని, ప్రతి పథకంలోనూ బీసీ వర్గాలకు ప్రాముఖ్యత కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రజాప్రభుత్వంలోనూ బీసీ డిక్లరేషన్ అమలు చేయబోతున్నామన్నారు. టీడీపీ జాతీయ క్రమశిక్షణా సంఘం సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో బీసీలకు జరిగిన నష్టాన్ని గుర్తుచేస్తూ రాబోయే ప్రజాప్రభుత్వంలో బీసీల డిక్లరేషన్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తురకా వీరస్వామి, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వేముల అంజనేయులు, కామిశెట్టి రమేష్, బత్తుల శ్రీను, కొమ్మినేని రామచంద్రరావు, వడ్డవల్లి సాంబశివరావు, పణితి రవి, పిల్లి చెన్నారావు, ఉసిరికాయల అంకారావు, తిరుమల, వల్లెపు రామకృష్ణ, కుంచపు గంగరాజు, చల్లగుండ్ల శ్రీను, నడికోట సత్యం, సైదా, కోట హరి, పాదర్తి రాజేశ్వరితో పాటు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్ పోలియో అమలు తీరు పరిశీలన

క్రోసూరు, మార్చి 6 : ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం సభ్యులు బుధవారం క్రోసూరు మండలంలో పర్యటించారు. బృందానికి ఆధ్వర్యం వహించిన డాక్టర్ కోటేశ్వరరావు క్రోసూరు ఎస్టీ కాలనీలోని గృహాలను సందర్శించి పల్స్ పోలియో అమలు తీరును పరిశీలించారు. పల్స్ పోలియో వేసిన పిల్లల గృహాలపై మార్కింగ్, చుక్కలు వేయించుకున్న చిన్నారుల ఎడమ చేతి చిటికిన వేలికి జంక్షన్ వయొలెట్ మార్కింగ్ ఉందా, లేదా అని పరిశీలించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, హెల్త్ సూపర్‌వైజర్లు శివుడు, ప్రభావతి, ఆరోగ్య కార్యకర్త లావణ్య పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతి టీడీపీ, జనసేనలతోనే సాధ్యం

సత్తెనపల్లి, మార్చి 6 : బీసీల అభ్యున్నతి టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ బీసీ సెల్ నేతలు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీల్లోని అన్ని కులాలకు సమప్రాధాన్యం లభిస్తుందన్నారు. సమావేశంలో బత్తుల వెంకట స్వామి, పూజల వెంకట కోటయ్య, తొరటి వెంకటరావు, గొట్టిపాటి హరేకృష్ణ, మారెళ్ల మల్లేశ్వరరావు, మామిడి వెంకటేశ్వరరావు తదితర బీసీ నాయకులు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అచ్చంపేట, మార్చి 6 : అచ్చంపేటలోని సాయిబాబా కళ్యాణ మండపంలో బుధవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఏపీ) (ఎస్టీయూఏపీ) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు గంధం గంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల గొప్పతనాన్ని వివరించారు. 12 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ అనీల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌వీ రామిరెడ్డి, యూ చంద్రజిత్ పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు బత్తుల సాంబశివరావు, మండల కార్యదర్శి ఎస్ వెంపలరావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు

ముప్పాళ్ళ, మార్చి 6 : మండలంలోని చాగంటివారిపాలెం జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో శంకర్ కంటి హాస్పటల్ వారు బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మందికి హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ హర్షిత కంటి పరీక్షలు చేశారు. 20 మందిని శుక్లం శస్త్ర చికిత్స కొరకు ఎంపిక చేశారు. శిబిరంలో సిబ్బంది రాజ్యలక్ష్మి, లక్ష్మీపూజిత, క్యాంపు ఇన్‌చార్జ్ సైదులు, ఆలయ కమిటీ సభ్యుడు ఏయస్‌కేవి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

నకరికల్లు, మార్చి 6 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కుంకలగుంటలో ఉన్న శ్రీ భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం గణపతి పూజతో ప్రారంభించి మహా రుద్రాభిషేకాలు జరపనున్నారు. లింగోద్భవ కాలం వరకు స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని దేవాలయ ప్రాంగణమంతా విద్యుత్ కాంతులీనుతుంది.

మహంకాళిరావును పరామర్శించిన శౌరయ్య

నకరికల్లు, మార్చి 6 : కుంకలగుంట టీడీపీ నేత మాలపాటి మహంకాళిరావును బుధవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య పరామర్శించారు. మహంకాళిరావు నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శౌరయ్యతో పాటు పార్టీ నేతలు ఢీకొండ మహానంది, పలువురు టీడీపీ నేతలు మహంకాళిరావుని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పెద్దిరాజు(ఫైల్)

పెదకూరపాడు, మార్చి 6 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి కాలు విరిగిన సంఘటన పెదకూరపాడులో జరిగింది. ఫిరంగిపురం అల్లంవారిపాలేనికి చెందిన చిమటా పెద్దిరాజు (34), కావటి శ్రీనివాసరావులు బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి అడ్డరోడ్డు మీదుగా అమ రావతి వైపు వెళుతుండగా ఆర్ అండ్‌బీ రోడ్డులో లో లెవల్ చప్టా వద్ద లారీ ఢీకొనటంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న చిమటా పెద్దిరాజు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతని వెనుక ఉన్న కావటి శ్రీనివాసరావు కాళ్ళకు, తలకు బలమైన గాయాలు కావ టంతో 108 వాహనంలో సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువె ళ్ళారు. మంగళవారం రాత్రి శ్రీశైలం నుంచి ఫిరంగిపురం వచ్చి బు ధవారం అమరావతి దేవాలయానికి బయలు దేరినట్టు మృతుని బం ధువులు తెలిపారు. పెద్దిరాజుకు భార్య తిరుపతమ్మ, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఎస్ఐ విప్పర్ల వెంకటరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం అమరావతి ఆరోగ్య కేంద్రానికి మృతదేహాన్ని తరలించారు.

ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి రూ.14 లక్షల ఆదాయం

బెల్లంకొండ, మార్చి 6 : బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయానికి వేలం పాట ద్వారా రూ.14,29,500 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకటేశ్వరుడు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు టోపీలు అందజేత

మాచర్ల రూరల్, మార్చి 6 : పట్టణంలోని పల్నాడు జూనియర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యాన బుధవారం ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, కార్మికులు టోపీలు, బ్యాడ్జిలు, విజిల్స్‌ను అందించారు. సాగరమాత ఉత్సవాలు, మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ

అచ్చంపేట, మార్చి 6 : అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మండలంలోని 2400 మంది మహిళలకు ఇళ్ళ రిజిస్ట్రేషన్ పట్టాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రయ్య, జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజినీ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ, జనసేన కూటమి గెలుపునకు కొమ్మాలపాటి పూజలు


హోమంలో పాల్గొన్న కొమ్మాలపాటి దంపతులు

అమరావతి, మార్చి 6 : రానున్న సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన కూటమి అత్యధిక స్థానాలలో గెలుపొంది అధికారం చేపట్టాలని కోరుతూ బుధవారం మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలోని ఉగ్ర ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఆలయంలో లక్ష్మీగణపతి, రుద్రహోమాలను ఆలయ అర్చకులు ఘంటసాల చంద్రమౌళి, మణికంఠలు శ్రీధర్ దంపతులతో చేయించారు. అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీధర్ విలేకరుల తో మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన అంతం కావాలని కోరుకున్నానని చంద్రబాబు నాయకత్వంలో ప్రజాపాలన రావాలని అన్నారు. చంద్రబాబు నాయుడు తనకు గురువుతో సమానమని ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటా నని అన్నారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలకు అనేక మంది ఆశావహులుంటార ని పార్టీ నిర్ణయమే శిరోధార్యమని, తన నిర్ణయం కూడా చంద్రబాబు నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలు ఆలయాలలో భాష్యం ప్రవీణ్ పూజలు

తెలుగుదేశం పార్టీ నాయకుడు భాష్యం ప్రవీణ్ బుధవారం మండల పరిధిలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా వైకుంఠపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎండ్రాయి గ్రామంలోని శివాలయం, అత్తలూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రవీణ్ వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు బీఎల్‌వోలు కృషి చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మురళీకృష్ణ

సత్తెనపల్లి, మార్చి 6 : నియోజకవర్గంలో ఎన్నికలు సక్రమంగా న్విహించేందుకు బీఎల్‌వోలు కృషి చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ అన్నారు. బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు బుధవారం ఎన్‌టీఆర్ భవన్‌లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మరణాలు, డబుల్ ఎంట్రీలు, ఇతర తప్పులు ఏమైనా ఉంటే బీఎల్‌వోలు గుర్తించి తమ దృష్టికి తేవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 70 శాతం ఓటింగ్ జరిగేలా గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించాలన్నా రు. గ్రామాల్లో ఈవీఎంలపై మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఐదు రోజుల్లో ఇంటి వద్దనే ఓటు నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఈవీఎంల పని తీరు గురించి బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఇంకా పలు అంశాలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు శిక్షణకు హాజరయ్యారు.

తప్పుడు కేసుల నమోదు తగదు : టీడీపీ

సత్తెనపల్లి, మార్చి 6 : నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేయించటానికి మంత్రి అంబటి రాంబాబు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని టీడీపీ నేతలు అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి అంబటి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను తొలగింపజేస్తున్నారన్నారు. సత్తెనపల్లిలో, మండలాల్లో తన ఫొటోలతో ఇబ్బడి ముబ్బడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నా రన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న కార్యకర్తలను ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలను అంబటి బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. అంబటి బెదిరింపులు మానుకోవాలని, లేకుం టే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పార్టీ నేతలు హెచ్చరించారు. విలేకరులతో మాట్లా డిన వారిలో ఆళ్ళ సాంబయ్య, పూజల వెంకట కోటయ్య, కంభాల వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీను, డీ.బాపయ్య చౌదరి, తొరటి వెంకటరావు, వెలిశల వెంకటరావు, బొజ్జా కాంతారావు తదితరులు ఉన్నారు.

జగన్ మరోసారి ప్రమాణ స్వీకారం హాస్యాస్పదం : కనుమూరి

సత్తెనపల్లి, మార్చి 6 : జయహో బీసీ సభ విజయవంతం కావటంతో జగన్ మరోసారి సీఎంగా ప్రమాణం చేస్తానని అనటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసమే తెర మీదకు విశాఖ రాజధాని తెచ్చారన్నారు. ఇప్పటికే పచ్చని విశాఖను వైసీపీ నేతలు కబ్జాలమయంగా మార్చారని తెలిపారు. బాబాయి హత్యతో రాయలసీమ ప్రాంత ప్రజలు జగన్‌ను నమ్మటం లేదని, అమరావతికి చేసిన ద్రోహంతో కోస్తాంధ్ర ప్రజలు నమ్మటం లేదన్నారు. ఇక మిగిలింది కేవలం ఉత్తరాంధ్ర అని, అందుకే ఇప్పుడు విశాఖ నుంచే పాలన అని కొత్త పల్లవిని అందుకున్నారన్నారు.

అంబటికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తాం : పంచుమర్తి

సత్తెనపల్లి, మార్చి 6 : రానున్న ఎన్నికల్లో మంత్రి అంబటికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తామని సత్తెనపల్లి మండలం ఫణిదం సంగం డెయిరీ పాల కేంద్రం ప్రెసిడెంట్ పంచుమర్తి రంగారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ నేతగా అంబటి విజయం కోసం గత ఎన్నికల్లో ఎంతగానో కృషి చేశామన్నారు. అంబటి గెలిచాక తమకు న్యాయం చేయలేదన్నారు. లక్షలు ఖర్చు పెట్టి గెలిపించినా ఏనాడు గ్రామాభివృద్ధికి ఉపయోగపడలేదన్నారు. గ్రామంలోని జగనన్న కాలనీకి మట్టి కూడా తోలుకోనివ్వలేదన్నారు. వేరే గ్రామానికి చెందిన వ్యక్తులు వచ్చి గ్రామంలోని చెరువు మట్టిని అమ్ముతున్నారన్నారు. అంబటి వల్ల తమకు ఒరిగిందేమి లేదని, రానున్న ఎన్నికల్లో అతనికి ఓటు వేసే ప్రసక్తే లేదని తెలిపారు.

టీడీపీ అంటే బీసీలు : రాఘవయాదవ్

రాజుపాలెం, మార్చి 6 : తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీలు.. బీసీలంటేనే తెలుగుదేశం పార్టీ .. ఇందులో ఎవరికి ఎలాంటి సందేహం అవసరం లేదని నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవయాదవ్ చెప్పారు. రాజుపాలెం గ్రామంలో ఉన్న మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం రాఘవయాదవ్ మాట్లాడుతూ మంగళవారం జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు బీసీ కులాల ప్రగతి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. బీసీల కోసం ఎన్నో మంచి పథకాలు, వారి రక్షణ కోసం కట్టుబడి ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీల వైపు బీసీలందరూ ఉండాలని, బీసీలందరూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

ముప్పాళ్ళ, మార్చి 6 : తెలుగుదేశం పార్టీ గెలుపునకు యువత కృషి చేయాలని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలో టీడీపీ సీనియర్ కార్యకర్త అన్న పురెడ్డి వెంకటేశ్వ రరెడ్డి అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన నివాసంలో బుధవారం కన్నా నాగరాజు పరామర్శించారు. అనంతరం గ్రామంలో మృతి చెందిన నీలం పార్వతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



సిబ్బందికి వాకీటాకీలను అందిస్తున్న టెక్నికల్ డైరెక్టర్ జయభారతరావు, ఎస్ఈ అవుల మురళీకృష్ణ యాదవ్

కోటప్పకొండలో నిరంతర విద్యుత్‌పై దృష్టి

● టెక్నికల్ డైరక్టర్, ఆపరేషన్ ఎస్ఈల పరిశీలన
● అదనపు అధికారులు, సిబ్బంది ఏర్పాటు

గుంటూరు, మార్చి 6: మహా శివరాత్రికి రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ తిరునాళ్ళలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాపై ఆ శాఖ యంత్రాంగం ఫోకస్ పెట్టింది. ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్ బి.జయభారతరావు, గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ ఇతర అధికారులు బుధవారం కోటప్పకొండ ప్రాంతంలో పరిశీలించారు. తిరునాళ్ళలో విద్యుత్‌శాఖాపరంగా ఎటువంటి సమస్యల్లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో పాటు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. 132 కేవీ, 33కేవీ, 11 కేవీ ఫీడర్లను పరిశీలించిన అధికారులు అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేసుకోవాలని జయభారతరావు సూచించారు. ఈ సందర్భంగా తిరునాళ్ళ కోసం ప్రత్యేకంగా నలుగురు ఏడీఈలు, 15మంది ఏఈలు, 150 అదనపు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

తిరునాళ్ళను సమష్టి కృషితో విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



కోటప్పకొండలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 6: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవాన్ని ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిదులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఏకాదశి పురస్కరించుకొని కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేకపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. నరసరావుపేట మండలంలోని కాకానిలో కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా కాకానిలో ఏర్పాటుచేసిన భారీ విద్యుత్ ప్రభను ప్రారంభించారు. వాసవి క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో త్రికోటేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ప్రసాదం, తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం కోటప్పకొండ దేవస్థానంలో నూతనంగా నిర్మించిన సూట్‌రూమ్‌ను దాతలతో కలిసి ప్రారంభించారు. పాత కోటయ్యస్వామి వారి దేవస్థానం మెట్లమార్గం కోసం నూతనంగా నిర్మించేందుకు భూమి పూజ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నరసరావుపేట-కోటప్పకొండ (యల్లమంద) వద్ద ప్రధాన రహదారి వంతెనను ప్రారంభించారు.



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

నరసరావుపేట రూరల్, మార్చి 6: పల్నాడు జిల్లాలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. మాచర్ల పట్టణంలో బుధవారం జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ కొనుగోలు కేంద్రాల ద్వారా దాల్ మిల్లర్లకు రవాణా జరిగిన కందుల వివరాలపై సమీక్షించారు. మాచర్లలోని శ్రీనివాస దాల్ మిల్లును ఆకస్మికంగా తనిఖీచేసి కందిపప్పు మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 17,300 హెక్టార్లలో కందిపంటను రైతులు సాగుచేశారని 25,000 మెట్రిక్ టన్నుల కందులు దిగుబడి వచ్చిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 1296 రైతులకు 17,41,63,647 రూపాయలను ఆధార్ కార్డు అనుసంధానించబడిన బ్యాంకు ఎకౌంట్లో నేరుగా కొనుగోలు జరిగిన నాలుగు నుంచి ఐదు రోజుల వ్యవధిలో నగదు జమ చేశామన్నారు.

పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థుల ప్రతిభ



డీఎస్‌పీడీ లక్ష్మి, ఇస్తేరురాణి, షేక్ సిలార్ అప్సకి

నరసరావుపేట టౌన్, మార్చి 6: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన బీఎస్సీ ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మేజర్ జీ వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. బీఎస్సీ ఎంబీసీ విభాగంలో దోగిపర్తి సౌమ్య ప్రసన్న ధనలక్ష్మి 95.4 శాతం, బీఎస్సీ బీజడ్‌సీలో పాలంకి ఇస్తేరుపాల్ 90.44 శాతం, బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ విభాగంలో షేక్ సిలార్ అప్సకి 89.25 శాతం, బీఎస్సీ ఎంసీసీఎస్‌లో షేక్ నన్ను మహమ్మద్ ఫిరోజ్ 88.5 శాతం, బీఎస్సీ ఎస్ఈఎస్‌లో బుట్టి ప్రియకుమార్ 86.5శాతం, బీఎస్ఎంసీపీలో చెన్నుబోయిన కాసిబాబు 72శాతం మార్కులు సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మేదరమెట్ల ప్రేమ్‌చంద్, ట్రెజరర్ డాక్టర్ మోదరమెట్ల అన్నపూర్ణమ్మ, జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బీ రాధాక్రిష్ణమూర్తి, అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.మల్లికార్జునరావు, అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో అధ్యాకులు

కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, మార్చి 6: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రకటించిన పరీక్ష ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎస్.స్నేహలత ఎంపీసీఎస్‌లో 96.5 శాతం, వీ అశ్వనీ ఎంఎస్‌సీఎస్‌లో 96.3శాతం, పీ పావని 96.1శాతం, ఎన్ వినీత ఎంపీసీలో 95.5శాతం, ఐ తేజశ్వని ఎంబీసీసీఎస్‌లో 94.7శాతం, జీ నందిని బీజెడ్‌సీలో 94.1 శాతం, వైవీ ప్రసన్నలక్ష్మి ఎంసీసీఎస్‌లో 90.1శాతం, ఆర్‌వీ రమణ ఎంఈసీఎస్‌లో 87.8శాతం, మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డీ యేగేశ్వరరావు, ఎండీఎస్ శాయికుమార్, మల్లారెడ్డి, కే అప్సర, కే నాగలక్ష్మి, ఎస్ నాగమల్లేశ్వరి, ఎన్ శ్రీదేవి, అధ్యాపకులు అభినందించారు.

డ్రెయిన్‌లో పడిన ఆవుదూడను కాపాడిన స్థానికులు

వినుకొండ, మార్చి 6: ప్రమాదవశాత్తు ఆవుదూడ డ్రెయిన్‌లో పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే గత కొంతకాలంగా కాలువలో మురుగునీరు ప్రవహించిన దాఖలాలు లేకపోవడంతో, ప్రమాదవశాత్తూ డ్రెయిన్‌లో ఆవుదూడ పడి ప్రాణాపాయస్థితివుంది. గమనించిన కళ్యాణ్ అనే యువకుడు తోటిమిత్రుల సాయంతో పోలీసులకు సమాచారం అందించి, కాలువలోని ఆవుదూడ కోసం సుమారు 3 గంటలపాటు శ్రమించి ఎట్టకేలకు ఆవును డ్రెయిన్‌నుంచి వెలికితీసి ప్రాణాలు కాపాడారు. దీంతో స్థానికులు, పోలీసులు కళ్యాణ్‌ను, వారి మిత్రులను అభినందించారు.

శివరాత్రికి సిద్ధమైన విద్యుత్ ప్రభలు



తిరునాళ్లకు సిద్ధమైన కోమటినేనివారిపాలెం, గోవిందపురం, కావూరు, నాదెండ్ల విద్యుత్ ప్రభలు

● గ్రామాల్లో సందడి వాతావరణం

చిలకలూరిపేట, మార్చి 6: కోటప్పకొండ తిరునాళ్ళకు చిలకలూరిపేట ప్రాంతంలో విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. అన్ని గ్రామాల్లో ప్రభలను విద్యుత్ దీపాలతో అలంకరించి తిరునాళ్ళకు తీసుకు వెళ్ళేందుకు సిద్ధం చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని 14గ్రామాల నుంచి మొత్తం 16 విద్యుత్ ప్రభలను అందంగా అలంకరించి తిరునాళ్ళకు తీసుకు వెళ్ళేందుకు మంగళ, బుధవారాల్లో సంసిద్ధం చేశారు. చాలా గ్రామాల్లో బుధవారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలను ప్రభల వద్ద ఏర్పాటుచేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రభల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఒక్కొక్క విద్యుత్ ప్రభ నిర్మాణానికి రూ.30 లక్షలు వరకు ఖర్చుచేశారు. గురువారం ప్రభలు ఆయా గ్రామాల నుంచి బయలుదేరి కోటప్పకొండకు తరలివెళ్తాయి. శుక్రవారం ఉదయం అన్ని ప్రభలు విద్యుత్ గ్రిడ్‌కు అనుబంధంగా ఉన్న విద్యుత్ లైన్‌లను దాటి ముందుకు వెళ్తాయి. ఆ సమయంలో గంటా రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేయటం జరుగుతుంది. ఒక్కొక్క ప్రభ చుట్టూ పగ్గాలను పట్టుకొనేందుకు సుమారు వంద మందికి పైగా వ్యక్తులు ఉంటారు. ప్రభల వెంట ఆయా గ్రామాల నుంచి ప్రజలు ట్రాక్టర్లపై, కాలి నడకన తరలివెళ్తారు. ముందురోజు, తిరునాళ్ళ రోజు, తిరునాళ్ళ మరుసటి రోజు రెండు పూటలా ప్రభ వద్ద వెయ్యి మంది వరకు భోజన సౌకర్యం ప్రభ నిర్వాహకులు కల్పిస్తారు. జనరేటర్లు విద్యుత్ లైటింగ్‌కే ఒక్కొక్క ప్రభకు రూ.15 లక్షలు వరకు ఖర్చుచేశారు. 90అడుగుల ఎత్తుకు పైగా ఉండే ప్రభలను నిర్మించటం ఆనవాయితీగా ఉంది. బుధవారం రాత్రి కావూరు, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, గోవిందపురం, కమ్మవారిపాలెం, మద్దిరాల, ఎడవల్లి గ్రామాల్లో గ్రామస్థులు ప్రభ పండుగను ఉత్సాహభరితంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బంధుమిత్రులకు ప్రత్యేకంగా విందు ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి కోమటినేనివారిపాలెం, బొప్పూడి గ్రామా ల్లో ప్రభ పండుగను నిర్వహించారు. పురుషోత్తపట్నం నుంచి ఆరు విద్యుత్ ప్రభలు తిరునాళ్ళకు వెళ్ళేందుకు సిద్ధం చేశారు.

● **నాదెండ్ల:** ఈ నెల 8వ తేదీన జరగనున్న కోటప్పకొండ తిరునాళ్ళకు తరలి వెళ్ళేందుకు భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామ ప్రజలు ఈ ప్రభలను నిర్మాణం చేశారు. ఒక్కొక్క ప్రభ నిర్మాణానికి సుమారు రూ.30లక్షల వ్యయం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామ పండుగను నిర్వహించారు. గురువారం 11గంటలకు ప్రభలు గ్రామాల నుంచి కొండకు బయలు దేరనున్నాయి. కాగా అమీన్‌సాహెబ్‌పాలెంలో పూనాటి కుటుంబీకులు 33 అడుగుల ఎత్తుగల మరో విద్యుత్ ప్రభను మొక్కుబడి తీర్చుకొనేందుకు నిర్మాణం చేశారు.



వినుకొండ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విషజ్వరాలతో కనమర్లపూడి విలవిల

కనమర్లపూడి (శావల్యాపురం) మార్చి 6: మండలంలోని కనమర్లపూడి గ్రామంలోని ప్రజలు విషజ్వరాల బారినపడి విలవిలలాడుతున్నారు. గ్రామానికి చెందిన మందపాటి రమణ, బోడపూడి తేజ, రాగాల కోటితో పాటు కొందరు వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు పొందుతుండగా మరికొందరు ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. గ్రామంలో 50మందికి పైగా జ్వరాల బారినపడ్డారని, ప్రతి కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు విషజ్వరాల బారిన పడుతున్నారని, కొందరు డెంగీతో కణాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో ఇంత దారుణ పరిస్థితి నెలకొన్నా వైద్యాధికారులు గానీ, ఏఎన్ఎంలు గానీ పట్టించుకున్న దాఖలాలే లేవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిన గ్రామంలో జ్వరాల సర్వే చేయించి విషజ్వరాల బారినపడిన రోగులు మంచి వైద్యసేవలు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



లైన్‌మెన్ గాజుల చిన్న కొండలను సన్మానిస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బంది

ఏపీఈఈయూ జిల్లా అధ్యక్షుడిగా లైన్‌మెన్ చినకొండలు

బొల్లాపల్లి, మార్చి 6: మండలంలోని బొల్లాపల్లి మండల లైన్‌మేన్‌గా పనిచేస్తున్న గాజుల చినకొండలు ఉమ్మడి గుంటూరు జిల్లా ఏపీఈఈయూ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. అలాగే కార్యదర్శిగా లింగనేని వరప్రసాదులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరులోని సంగడికుంటలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వీరిరువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గాజుల చినకొండలు మాట్లాడుతూ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు యూనియన్ సభ్యులకు, కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానన్నారు. వీరు రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు, కార్మికులు అభినందించారు.

మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం రూ.4.89 కోట్లు జమ: జేసీ

నరసరావుపేట రూరల్, మార్చి 6: పల్నాడు జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం రైతుల ఖాతాలలో జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 315.54 ఎకరాల్లో నష్టపోయిన వ్యవసాయ, ఉద్యానవనశాఖ పంటలకు గాను మొత్తం 5897 రైతులకుగాను, మొత్తం నాలుగు కోట్ల ఎనభై తొమ్మిది లక్షల, తొమ్మిది వేల రూపాయిలను రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి విద్యాసంస్థల ప్రెసిడెంట్ మృతి

నరసరావుపేట టౌన్, మార్చి 6: పెట్లూరివారిపాలెంలో ఉన్న ఏఎంరెడ్డి విద్యాసంస్థల ప్రెసిడెంట్ గున్నం చంద్రశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో కనుమూశారని విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. గున్నం చంద్రశేఖర్ రెడ్డి మృతికి విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ బోధన సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

వినుకొండలో పోలీసుల కవాతు

వినుకొండటౌన్, మార్చి 6: రానున్న ఎన్నికల్లో ఆటంకం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ సీఐ సాంబశివరావు, రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. పట్టణంలోని వెన్నెల సూపర్ మార్కెట్ నుంచి శివయ్య స్తూపం సెంటర్ మీదుగా చెక్ పోస్టు సెంటర్ వరకు సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్సు (సీఏపీఎస్)పాటు స్థానిక పోలీసులు కలిసి కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పిలుపునిచ్చారు.

అగ్నిమాపక యంత్రాలపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ, మార్చి6: స్థానిక నిర్మల బాలికల పాఠశాల్లోని విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాద సమయంలో విద్యార్థులు ఎలా వ్యవహరించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఫైర్ యాక్సిడెంట్ జరిగితే అగ్నిమాపక దళం ఎలా సహాయ చర్యలు చేపడుతుందో పదిమంది సిబ్బంది మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు.

కక్ష సాధింపుతో ఓట్ల తొలగింపు

● కలెక్టర్ కార్యాలయంలో టీడీపీ నాయకుల ఫిర్యాదు

నూజెండ్ల, మార్చి 6: గత 30 సంవత్సరాలుగా స్థానికంగా నివాసం ఉంటూ ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న తమపై వైసీపీ నాయకులు కక్ష సాధింపు ధోరణితో ఓట్లను తొలగించి రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోకుండా ఆటంకాలు కల్పిస్తున్నారని నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం యానాది కాలనీకి చెందిన చేవూరి రాఘవులు, లక్ష్మిలు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎంతోకాలంగా కాలనీలో నివాసం ఉంటున్నామని, తమకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ప్రభుత్వం అందిస్తున్న పింఛను అందుకుంటున్నామన్నారు. ఇటీవల తమ కాలనీ వాసులపై వైసీపీ నాయకులు కక్షపూరితంగా వ్యవహస్తున్నారని, తమ ఓట్లను తొలగించేందుకు ఫారం-7లు పెట్టిన సందర్భంలో నూజెండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేసి నూతనంగా ఓట్లు ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముంద్రు సుబ్బారావు, మీసాల మురళీకృష్ణ యాదవ్, గంగినేని రాధాకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

వరికపూడిశెల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు హనుమంతారెడ్డి

వినుకొండటౌన్, మార్చి 6: పల్నాడు జిల్లా వాసుల చిరకాల కల వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి చివరిగా జరిగే మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు హనుమంతారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాచర్ల పట్టణంలో వరికిపూడిసెల ప్రాజెక్టుకు డిసెంబరు 15 తేదీన సీఎం జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ శంకుస్థాపన చేస్తూ మొదటి పేజ్‌లో వెల్దుర్తి మండలానికి 24వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు 340 కోట్లు విడుదల చేస్తున్నట్లు చెప్పారని, శంకుస్థాపన చేసి 90 రోజులు గడిచినా నేటికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం శోచనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా వివిధ రాజకీయ పార్టీలు ప్రాజెక్టు సాధన కోసం పోరాటాలు చేస్తున్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పూర్తిచేస్తామని ఇచ్చిన జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్‌లోపు పనులు ప్రారంభించని పక్షంలో రానున్న ఎన్నికల్లో ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో పోటీ చెయ్యడం జరుగుతుందని వైసీపీ ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.



శావల్యాపురంలో కందులను పరిశీలిస్తున్న ఏడీఏ రవిబాబు

దళారులను నమ్మి మోసపోవద్దు: ఏడీఏ రవిబాబు

శావల్యాపురం, మార్చి 6: కందులు విక్రయించే రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, అన్ని రైతుభరోసా కేంద్రాల్లో నాఫెడ్ ధర ప్రకారం కందులు కొనుగోలు చేయడం జరుగుతుందని వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. శావల్యాపురంలో జరుగుతున్న కందుల కొనుగోలును ఆయన బుధవారం పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 41.200 మెట్రిక్ టన్నుల కందులను ఇప్పటికే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. బుధవారం కందులు క్వింటా రూ.9722 కొనుగోలు చేశామని, దానిలో గోతాలు, కూలీలు, రవాణా ఖర్చుల కింద రూ.74.65లను కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కందులు విక్రయించిన రైతులకు నాలుగు రోజులలో ప్రభుత్వం నగదు జమచేస్తుందన్నారు. ఎంఏవో పల్లపోతు ప్రవీణ్, వీఏఏ బ్లెస్సీ, జీఎంసీ శ్రీను పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అధికారుల కృషి: బొల్లా

వినుకొండటౌన్, మార్చి6: నాణ్యమైన విద్యుత్ అదించడంలో అధికారుల కృషి మరువలేనిది అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వెంకుపాలెం సమీపంలోని జగనన్న కాలనీలో ఏర్పాటుచేసిన 33 కేవీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ జగనన్న కాలనీ వాసులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక సబ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారి శ్రీనివాసరావు, డీఈఈ కిరణ్‌బాబు, ఏఈలు పిచ్చయ్య, భాష తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డిపాలెంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

రొంపిచర్ల, మార్చి 6: రామిరెడ్డిపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.2.50 లక్షల వ్యయంతో మరమ్మతులు నిర్వహించిన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అదేవిధంగా బీసీ కమ్యూనిటీ హాల్ ప్రహరీని ప్రారంభించారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.40 లక్షల వ్యయంతో ఇంటింటికి తాగునీరు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గత నాలుగున్నర సంవత్సరాలుగా రూ.8 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ నాయకులు

యడ్లపాడు, మార్చి 6: మండలంలోని సొలస గ్రామంలోని రామన్న చెరువులో వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న అక్రమ మట్టి తవ్వకాలను టీడీపీ నాయకులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామంలోని సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సాగునీటి చెరువు పంచాయతీ ఆధీనంలో ఉంది. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులోని నీటిని రైతులు ఆయిల్ ఇంజన్‌ల ద్వారా పొలాలకు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో చెరువులోని మట్టిని వైసీపీ నాయకులు ఎలాంటి పంచాయతీ తీర్మానం, రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు ప్రారంభించారు. మట్టిని ట్రాక్టర్ల ద్వారా విక్రయిస్తుండటంతో సొలస ఎంపీటీసీ మద్దూరి శ్రీనివాసరెడ్డితో పాటు టీడీపీ నాయకులు తవ్వకాలను అడ్డుకున్నారు. టీడీపీ, వైసీపీ నేతలు రెండు వైపులా మోహరించటంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకొని పనులు నిలిపివేశారు. ఈ సందర్భంగా తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా చెరువు మట్టిని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు.

ఘంటా జగన్నాథరావుకు ఘన నివాళి

చిలకలూరిపేట, మార్చి 6: మంగళవారం సాయంత్రం మృతి చెందిన పట్టణ ప్రముఖులు ఘంటా జగన్నాథరావుకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, ఎంఎల్ కంపెనీ అధినేత మద్ది వెంకటేశ్వరరావు, గుంటూరు కమ్మజన సేవా సమితి అధ్యక్ష, కోశాధికారిలు కామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, కాటన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కందిమళ్ళ నాగేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది ఘంటా రామారావు, సీనియర్ కాంట్రాక్టర్ తేలప్రోలు వీరయ్య చౌదరి తదితరులు ఉన్నారు. ఏపీ కాటన్ అసోసియేషన్ అధ్యక్షులుగా, పొగాకు బోర్డు సభ్యుడిగా, శ్రీశైలం కాకతీయ సత్రం, చిలకలూరిపేట విద్యా సంఘం ఉపాధ్యక్షుడిగా జగన్నాధరావు విశేష రీతిలో సేవలను అందించారని ఈ సందర్భంగా వారు అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఇక్కడ ఆయన అంత్యక్రియలు జరిగాయి.

ఆటో మొబైల్ దుకాణంలో చోరీ

చిలకలూరిపేట, మార్చి 6: పట్టణంలోని కేబీ రోడ్డులో మంగళవారం హిందూస్థాన్ ట్రాక్టర్ స్పేర్స్ ఆటో మొబైల్ దుకాణంలో చోరీ జరిగింది. దుకాణం యజమాని రసూల్ తెలిపిన వివరాల మేరకు షాపులోని రూ.63వేల నగదు చోరీ అయింది. దుకాణానికి రెండువైపులా ఉన్న తాళాలను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు అర్బన్ పోలీసులకు దుకాణం నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుకాణం వద్దకు వచ్చి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్తిపాటి శరత్ అరెస్టుపై టీడీపీ నిరసన

నాదెండ్ల, మార్చి 6: మండలంలోని గణపవరం, నాదెండ్ల గ్రామాల్లో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ అక్రమ అరెస్టుకు బుధవారం రాత్రి టీడీపీ నాయకులు నిరసన తెలియ జేశారు. గణపవరం బొడ్డు రాయి సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా నాదెండ్లలో టీడీపీ, జనసేన నాయకులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బీ సత్యనారాయణ, ఎం లక్ష్మీనారాయణ, ఎస్ హరిబాబు, బీ బసవయ్య, వెంకటేశ్వర్లు, పాటిబండ్ల రామారావు, ఎన్ కోటేశ్వరరావు, హుస్సేన్, వెంకట్, రామస్వామి, మస్తాన్, జనసేన నేతలు శరత్, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

సబ్‌స్టేషన్ నిర్మాణంతో లోవోల్టేజీ సమస్య పరిష్కారం

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 6: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు లోవోల్టేజీ సమస్య లేకుండా పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందుబాటులో తెచ్చిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి వేల్పూరుకు వెళ్ళే మార్గంలో రూ.4.50కోట్లు వ్యయంతో ప్రభుత్వం కొత్తగా నిర్మించిన 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి స్విచ్ ఆన్ చేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి సహకరించిన నర్సరావుపేట డివిజన్ ఈఈ శ్రీనివాసరావు, కన్‌స్ట్రక్షన్ ఈఈ శ్రీనివాసరావు, ప్రొడక్షన్ ఈఈ నాగేశ్వరరావు, డీఈఈ వెంకటేశ్వరరెడ్డి, ఏఈ గాంధీబాబులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసినిఅనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, ఇన్‌చార్జి సర్పంచ్ బీర్నీడి రత్నగిరి, సీనియర్ నాయకులు గుత్తా కోటేశ్వర్రావు, తూమాటి కబ్బారావు, స్వర్ణాల వెంకట్రావు, ముంద్రు రాఘవరావు, రంతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారుమంచి ఇన్‌చార్జి సర్పంచ్‌గా గాలెయ్య

కారుమంచి (శావల్యాపురం) మార్చి 6: మండలంలోని కారుమంచి గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా మల్లాపరపు గాలెయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన మల్లాపరపు విశ్రాంతం వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న గాలెయ్యను ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమిస్తూ డీపీవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కారుమంచి గ్రామ సచివాలయంలో ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమితులైన గాలెయ్యకు ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావులు నియామకపత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్, వినుకొండ నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు గోపాళం శివప్రసాద్, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు తదితరులు గాలెయ్యను సత్కరించి అభినందనలు తెలియజేశారు. టీడీపీ నాయకులు మల్లాపరపు బాలకోటయ్య, నాగరాజు, అమృతపూడి కోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



శ్రీశైలం వడ్డెర అన్నదాన సత్రానికి బియ్యం తరలిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

శ్రీశైలంలో అన్నదానానికి బియ్యం వితరణ

వినుకొండ, మార్చి6: ఈనెల 8 తేదీన జరిగే మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని వినుకొండ పట్టణంలోని ఇందిరానగర్ కు చెందిన వడియ రాజుల అన్నదాన సత్రానికి 12 క్వింటాల బియ్యాం 25 వేలు నగదు శైవక్షేత్రం శ్రీశైలానికి తరలించారు. ఈసందర్బంగా వడియరాజుల సంఘంనాయకులు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా క్రమం తప్పకుండ అన్నదాన సత్రానికి బియ్యం పంపుతున్నట్లు వారుతెలిపారు. పండుగ సందర్బంగ దేవాలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున వడ్డెర సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు బండారు కోటయ్య, పల్లపు వెంకటేశ్వర్లు , చల్లా కుమార్ , బత్తుల వెంకటస్వామి , ఉప్పు చిన్న ఏడుకొండలు, కోటి నారాయణ, గురవయ్య, పిచ్చయ్య, రమణమ్మ, భాగ్యలక్ష్మీ, పాటు సభ్యులు పాల్గొన్నారు.